క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి..



ఎంఈఓ-1 సామల సింహాచలానికి వినతిపత్రం అందిస్తున్న మండల ఎంటీఎస్ ఉపాధ్యాయులు

బలిజిపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఎంఈఓ -1 సామల సింహాచలంను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తమను రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పని సర్దుబాటుకు కౌన్సెలింగ్ చేపట్టడం వల్ల ఇబ్బందులేర్పడుతున్నాయన్నారు. అలాగే ప్రత్యేక వసతులు కూడా కల్పించడం లేదన్నారు. దీనికి ఎంఈఓ స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

కొండచిలువ హతం

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ వెంకటాపురం పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతుల చేతిలో కొండచిలువ హతమైంది. గ్రామానికి చెందిన వన సంరక్షణ రైతు చంటి నర్సరీలో రైతులు సోమవారం ఉదయం మొక్కలు తీస్తుండగా.. అరడుగుల కొండచిలువ కనిపించింది. దీంతో భయపడిన రైతులు కర్రలతో కొట్టి చంపారు.

విద్యార్థుల పొలంబాట



వరినారును పరిశీలిస్తున్న విద్యార్థులు

సాలూరు: మండలంలోని పురోహితునిలస ఆదర్శ పాఠశాల విద్యార్థులు సోమవారం పొలంబాట పట్టారు. అగ్రికల్చర్ ఫీల్డ్‌విజిట్ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ అంజలీ దేవి, ట్రైనీ మంగమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు పొలానికి వెళ్లి నాట్లు వేయడాన్ని స్వయంగా పరిశీలించారు.

ఎగువ దాగరవలసకు బీటీ రోడ్డు



పూర్తయిన రోడ్డు

సాలూరు రూరల్ : మండలంలోని ఎగువ దాగరవలస గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈ రోడ్డు నిర్మాణానికి అప్పటి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శంకుస్థాపన చేశారు. నిధులు త్వరితగతిన మంజూరు చేయడంతో రూ. 2.80 కోట్లతో రోడ్డు వేశారు. రోడ్డు పూర్తవడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సరైన ప్రణాళికలతో అభివృద్ధి


- ఎంపీపీ ప్రమీల



మాట్లాడుతున్న ఎంపీపీ బద్నాన ప్రమీల

పాచిపెంట: సరైన ప్రణాళికలతోనే పంచాయతీలను అభివృద్ధి చేయడం జరుగుతుందని ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణ తరగతుల ద్వారా పంచాయతీల అభివృద్ధికి ఏ విధమైన ప్రణాళికలు సిద్ధం చేయాలో అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాత్రుడు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న అనురాధ

సాలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని ఏఓ అనురాధ పండా అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కషాయం తయారీపై అవగాహన కల్పించారు. భూమిలో జీవవైవిధ్యం పెంపొందించాలంటే ప్రకృతి సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమం వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి..

- స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురం:

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన నషా ముక్త్‌భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలో యువత రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. 'నాకు వంద మంది యువతనిస్తే దేశాన్నే మారుస్తా' అన్న స్వామి వివేకానంద సూక్తిని పునరుద్ఘాటిస్తూ యువత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని కోరారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఎస్. సేధుమాధవన్, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవనాయుడు, వికలాంగుల సంక్షేమ సహాయ సంచాలకురాలు కె. కవిత, డ్వామా ప్రాజెక్ట్ అధికారి కె. రామచంద్రరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం..

బలిజిపేట: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని ఎంపీపీ నాగమణి అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం ఆమె మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీడీపీఓ సులేఖ, సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొన్నారు.



బలిజిపేట: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు సహకరించాలి..

సీతానగరం: మత్తుపదార్థాల రహిత సమాజ స్థాపనకు యువతీ, యువకులు కృషి చేయాలని ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు అన్నారు. నిషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ, ప్రాణాలకు ముప్పు తెచ్చే కంబాకు, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలతో పాటు మాదకద్రవ్యాలకు బానిసలైతే నిండు జీవితం నాశనమవుతుందన్నారు. ప్రజలను చైతన్యపరచడానికే మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ, మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, గ్రామ సర్పంచ్‌లు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను, వెలుగు ఏపీఎం ఆర్. శ్రీరాములు, ఐసీడీఎస్ స్థానిక సెక్టార్ సూపర్‌వైజర్ పూర్ణిమ, అంగన్‌వాడీ, పంచాయతీరాజ్, మండల పరిషత్, వెలుగు మండల సమాఖ్య సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

దూరంగా ఉండాలి

మక్కువ: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వెలుగు ఏపీఎం సన్నిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యశ్రీ, లీలావతి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని వెలుగు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది, తదితరులు

వినతుల వెల్లువ..

పార్వతీపురం: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు అర్జీదారులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొనడంతో వినతులు వెల్లువలా వచ్చాయి. జియ్యమ్మవలస మండలం సింగనాపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన మరడ జగన్నాథంను కుటుంబ సభ్యులు మంచంపై కలెక్టర్ కార్యాలయానికి తీసుకువచ్చి పింఛన్‌ను రూ. 15 వేలు మంజూరు చేయాలని కోరుతూ, గిరిజన సంక్షేమశాఖా మంత్రికి వినతి అందజేశారు. పరిస్థితి గమనించిన మంత్రి పింఛన్ రూ. 15 వేలు మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ కె. విజయపార్వతిని ఆదేశించారు.

బడిదేవరకొండ అనుమతులు రద్దు చేయాలి..

పార్వతీపురం మండలంలోని బడిదేవర కొండపై గ్రానైట్స్ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, మూడడ్ల కృష్ణమూర్తి, తదితరులు వినతిపత్రం అందజేశారు. అటవీశాఖ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ మైనింగ్ శాఖ అనుమతులను మంజూరు చేసిందన్నారు. వెంటనే అనుమతులు రద్దు చేయాలని కోరారు.



మంచంపై తీసుకువచ్చిన దివ్యాంగుడిని పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

పారిశుధ్యం లోపించింది...

సాలూరు: మున్సిపాలిటీలో పారిశుధ్యం లోపించడం వల్లే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు వరలక్ష్మి, కృష్ణారావు, లక్ష్మీజి, హర్షవర్ధన్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపాలిటీలో పారిశుధ్య పనులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టడం లేదన్నారు. దీనిపై మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులు స్పందిస్తూ నిధులు సిద్ధంగా ఉన్నాయని, కౌన్సిల్ ఆమోదం తర్వాత పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి, నాయకులు వేణుగోపాల్, అప్పారావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల సహకారం అవసరం

- జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మక్కువ: పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే అధికారులు తప్పకుండా ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ పి. దేవకుమార్ అధ్యక్షతన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మావుడి మాట్లాడుతూ, పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులదే కీలకపాత్ర అని తెలిపారు. అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఏఐఎస్ఎఫ్(ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్) ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ మునకాల శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నేతలు కొంతమంది కలిసి ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. 1936లో ఇదేరోజున ఈ సంఘం ఏర్పాటైందని, అప్పట్లో సాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిందని, ఇప్పుడు విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేస్తోందని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు ప్రవీణ్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రెల్లి కులస్తులు

పార్వతీపురం టౌన్: రెల్లి కులస్తులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎ,బి,సి,డి వర్గాకరణలో రెల్లి, వాటి ఉప కులాలకు ఐదు శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని కోరారు. ఈ వర్గీకరణలో రెల్లి ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

తమకు న్యాయం జరిగే వరకు వివిధ దశల్లో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గండి భాగ్యవతి, డి. డానియేల్, రాజశేఖర్, ఎస్. మైనర్‌బాబు, కోల నానాజీ, సాండి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'బీరమాసి'ని నంద పంచాయతీలో చేర్చాలి..

మక్కువ: మండలంలోని బీరమాసి గిరిశిఖర గ్రామాన్ని (షెడ్యూల్డ్) నంద పంచాయతీలో చేర్చాలని రైతుకూలీ సంఘ మండల నాయుకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. బీరమాసి గ్రామాన్ని 20 ఏళ్ల కిందట నంద పంచాయతీ నుంచి వేరుచేసి, శంబర పంచాయతీలో చేర్చారన్నారు. మండలంలోని ఏకైక షెడ్యూల్డ్ గ్రామం బీరమాని అని తెలిపారు. షెడ్యూల్డ్ గ్రామమైనప్పటికీ తాగునీరు, రహదారి సదుపాయం లేక గిరిజనులు 20 ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి ఆ గ్రామాన్ని నంద పంచాయతీలో కలిపి అభివృద్ధి చేయాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న రైతుకూలీ సంఘ నాయికులు

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

- ఎంపీపీ నాగమణి

బలిజిపేట: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేయాలని ఎంపీపీ నాగమణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు పారిశుధ్యం, గ్రామ పంచాయతీ అభివృద్ధి పనుల ప్రణాళిక పరిశీలన, తదితర అంశాలపై మూడో రోజు సోమవారం కూడా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. అంటువ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎ.రవికుమార్, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఈఓపీఆర్డీ రవికుమార్, ఏఓ భానుమూర్తి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

- తహసీల్దార్ రాములమ్మ



మాట్లాడుతున్న తహసీల్దార్ రాములమ్మ

సీతానగరం: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ శాఖాపరమైన సమస్యలను పరిష్కరించడానికి త్వరలో నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ జె. రాములమ్మ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో శాఖాపరమైన సమస్యలతో పాటు వివిధ రకాల సమస్యలను స్థానికంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. ఈ నెల 15న ఈ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తామని చెప్పారు. ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 31 వరకు గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జీఓ 117 రద్దు చేయాలి..



బలిజిపేటలో ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బలిజిపేట: జీఓ 117 రద్దు చేసిన తర్వాత పని సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంఈఓ కార్యాలయం వద్ద నిర్వహించాల్సిన పని సర్దుబాటు ప్రక్రియను సోమవారం బాయ్‌కాట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రభుత్వం అసంబద్ధాలను సరిచేయకుండా పని సర్దుబాటు ప్రక్రియ ఎలా చేపడుతుందో అర్థం కావడం లేదన్నారు.

జిల్లా అంతా సర్‌ప్లస్ ఉపాధ్యాయులు కనిపిస్తుంటే ఈ ప్రక్రియ చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏదిఏమైనా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎం.శేషగిరిరావు, వి.ధర్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పునశ్చరణ తరగతులు వినియోగించుకోవాలి

- ఎంపీడీఓ ఈశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూపొందించాల్సిన ప్రణాళికలపై ఏర్పాటు చేసిన పునశ్చరణ తరగతులను సర్పంచ్‌లు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి. రవణమ్మ అధ్యక్షతన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గ్రామసభలు నిర్వహించాలని, ప్రజాభిప్రాయం సేకరించాక ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్టాలన్నారు. తాగునీరు, పారిశుధ్య పనులు విద్యుదీకరణ, ప్రజారోగ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. గ్రామ పంచాయతీలకు వివిధ పథకాల ద్వారా విడుదలవుతున్న నిధులు సక్రమమార్గంలో వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

సాలూరు: ప్రత్యేక రాష్ట్రంతోనే ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి చెందుతాయని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరతరాలుగా వెనుకబాటుతనానికి గురవుతున్న, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక రాష్ట్రం సాధించడమే ఏకైక మార్గమన్నారు. అనంతరం హెచ్‌డీటీ భానుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు రెడ్డి సత్యంనాయుడు, చుక్క సన్యాసిరావు, కూర్మినాయుడు, రెడ్డి తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉత్తరాంధ్ర సాధన సమితి నాయకులు

చట్టాలపై అవగాహన తప్పనిసరి

సాలూరు రూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు తాడ్డి తిరుపతిరావు అన్నారు. మండలంలోని కురుకూటి బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులను పరీక్షించారు. కార్యక్రమంలో సాలూరు సీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు అందించాలి..



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

మక్కువ: అన్యాక్రాంతానికి గురైన భూములను పేదలకు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ.. మండలంలోని వెంకటభైరిపురం, లోవరఖండి గ్రామాలతో పాటు పలు గ్రామాలకు చెందిన గిరిజనులు, పేదలు కొండపోరంబోకు, అటవీభూములను 25 ఏళ్లుగా సాగుచేస్తున్నప్పటికీ అధికారులు పట్టాలు అందివ్వలేదన్నారు. అలాగే శంబర, ఎస్.పెద్దవలస గ్రామాలలో పేదల భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని, అధికారులు దర్యాప్తు నిర్వహించి ఆ భూములను పేదలకు అందివ్వాలని కోరారు. ఈ నెల 29లోగా సమస్యలను పరిష్కరించకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు టి.ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు పిట్టల సీతారాం, అల్లు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.